సాక్షి
తిరుపతి

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



దర్భ చాప, తాడు ఊరేగింపు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజస్తంభానికి వాడే దర్భచాప, తాడును అటవీశాఖాధికారులు ఊరేగించారు. - IIలో



సమస్యలు పరిష్కరించండి

పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన అర్జీలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని బాధితులు కలెక్టర్‌ను వేడుకున్నారు. - IIలో



ప్రతి భక్తుడికీ బస్సు సౌకర్యం

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఈడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. - IIలో

న్యూస్‌రీల్

పరిశోధనలతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జయకుమార్ సాహూ

తిరుపతి సిటీ: నాణ్యతతో కూడుకున్న పరిశోధనలతోనే దేశం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఒడిశా, భువనేశ్వర్ భారత ప్రభుత్వ ఎన్‌ఆర్‌డీసీ బ్రాంచ్ ఆఫీస్ హెడ్ డాక్టర్ బి జయకుమార్ సాహూ పేర్కొన్నారు. 'రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఫర్ యూనివర్సిటీ ఎక్సలెన్స్ అండ్ సస్టైనబులిటీ' అనే అంశంపై శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ – కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెనేట్ హాల్లో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పరిశోధనలు నూతన దృక్పథంతో సాగాలని ఆకాంక్షించారు. మేధో సంపత్తిని పరిశోధనల కోసం వినియోగించాలని కోరారు. పరిశోధన ఫలితాలకు ప్రాపర్టీ రైట్స్ తీసుకోవడంతో ఆయా పరిశోధన సంస్థలు, యూనివర్సిటీలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య పద్మావతి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఎట్టకేలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మూడు నెలలుగా నిరీక్షించిన అభ్యర్థులకు కాస్త ఉపశమనం లభించినట్లు అయ్యింది. ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ సెట్–2025 పరీక్ష ఫలితాలు విడుదల చేసి నెలలు గడిచాయి. ప్రవేశాల ప్రక్రియ నాగార్జున వర్సిటీకీ అప్పగించడంతో మరింత ఆలస్యమైంది. దీంతో ఎట్టకేలకు ప్రవేశాలు చేపట్టిన కన్వీనర్ ఎస్వీయూ పరిధిలోని సుమారు 2,500కు మించి ఉన్న సీట్లకు గాను కేవలం 875 మంది మాత్రమే తొలివిడతలో ప్రవేశాలు పొందనున్నారు.

ఎన్‌ఎస్‌యూలో వర్క్‌షాపు



డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ: తిరుపతి రీజినల్ సెంటర్ ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్‌పై వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. దీనికి వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ సేవా స్ఫూర్తిని పెంపొందించడం, కళల ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఊహించడం సాధ్యమవుతుందన్నారు. ఐజీఎన్‌సీఏ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కేటీవీ రాఘవన్ పాల్గొన్నారు.

స్విమ్స్‌పై కాల కూటమి



సీమవాసులకు అత్యాధునిక వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో టీటీడీ సౌజన్యంతో స్విమ్స్ ఆస్పత్రి ఏర్పడింది. నాటి నుంచి పేదలకు ఆధునిక వైద్యం అందిస్తోంది. అయితే కూటమి సర్కారు రాకతో కూటమి రాజకీయ విషపు పడగ దానిపై పడింది. ఫలితంగా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారింది. అక్రమ నియామకాలు.. ఉద్యోగోన్నతులు.. అయిన వారికి అధిక వేతనాలు.. ఒకటేమీ.. అన్నింటా రాజకీయ జోక్యం చోటు చేసుకుంది. ఆస్పత్రి స్థాపన లక్ష్యం నీరుగారుతోంది.



అక్రమ నియామకాలకు నోటిఫికేషన్

- స్విమ్స్‌ని పచ్చమయం చేసేందుకు అడుగులు
- మరో వైపు నియామకాల పేరుతో భారీగా వసూళ్లకు స్కెచ్
- విరాళాలు సైతం పక్కదారి పడుతున్నాయంటున్న సిబ్బంది
- సేవా దృక్పథం కోల్పోతోందంటూ భక్తులు, రోగుల ఆవేదన
- ఎన్ఎంసీ నిబంధనలకు తుంగలో తొక్కుతున్న ఆ ఇద్దరు
- దయనీయ స్థితికి చేరుతున్న స్విమ్స్ భవిత

సాక్షి టాస్క్‌ఫోర్స్: స్విమ్స్ ఆస్పత్రి రాజకీయాలకు వేదికగా మారింది. విషపూరిత వాతావరణం రాజ్యమేలుతోంది. అక్రమ నియామకాలు, యాదృచ్ఛిక పదోన్నతులు, అయిన వారికి, అధికార పార్టీ సామాజిక వర్గాలకు చెందిన అధికారులు, వైద్యులకు అధిక వేతనాలు నిర్ణయించడం స్విమ్స్ మనుగడకు ప్రమాదకరంగా మారింది. దీంతో ఆస్పత్రిలో సేవా భావం దెబ్బతింటోంది. ఏడాది కాలంగా రోగుల సేవలను పక్కనపెట్టి స్వప్రయోజనాల కోసం పాకులాడే పరిస్థితికి చేరుకుంది. 'ముఖ్య' నేతకు చెందిన ఇద్దరు చొరబడి జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు వైద్యుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు మొత్తం కూటమి శ్రేణుల బంధువులు, సన్నిహితులతో నింపేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

ఆ ఇద్దరి కనుసన్నల్లో స్విమ్స్

గత 30 ఏళ్లలో లక్షలాది మంది రోగులకు సేవలందించిన స్విమ్స్ ఆస్పత్రి 'ముఖ్య' నేతకు సమీప బంధువులు ఇద్దరి ప్రమేయంతో అస్తవ్యస్తంగా మారుతోంది. ఆ ఇద్దరు స్విమ్స్‌లో తిష్టవేసి చేతివాటం ప్రదర్శిస్తూ ఆస్పత్రిని భ్రష్టుపట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చిందంటే ఆ ఇద్దరు స్విమ్స్‌లో వారు కోరుకున్న పదవులు దక్కించుకుంటారు. అలా ఏడాది క్రితం ఆ ఇద్దరు కోరుకున్న పదవిలోకి చొరబడడంతో స్విమ్స్‌ని వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. వారిద్దరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అన్ని విభాగాలు అస్తవ్యస్తంగా మారాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ క్షీణస్థితిలోకి వెళుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వేతనాలు చెల్లించడమే ఒక పెద్ద సమస్యగా మారిందని చెబుతున్నారు. వైద్యులు, నర్సులు, పరా మెడికల్, పరిపాలనా సిబ్బందికి చెల్లించే వేతన వ్యయం నెలవారీ ఆదాయానికి 200 శాతంగా ఉండి, టీటీడీ నుంచి వచ్చే నిధులన్నీ వేతనాలకే ఖర్చవుతున్నాయి. ఫలితంగా రోగులకు టీటీడీ నిధులు అందడం లేదు. దీంతో పేద రోగులు నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా గతం కంటే భారీగా తగ్గిపోగా, అందించే వైద్యసేవల్లో నాణ్యత కొరవడుతోందని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

ఏకైక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

రాయలసీమలోనే కాకుండా.. రాష్ట్రంలో అన్ని విభాగాలు, సూపర్‌స్పెషాలిటీ సౌకర్యాలు కలిగిన ఏకైక ఆస్పత్రి స్విమ్స్. టీటీడీ ఆధ్వర్యంలో పేద ప్రజలకు వైద్యసేవలు అందించే లక్ష్యంతో హైదరాబాద్ నిమ్స్ తర్వాత రాష్ట్రంలో ఆ స్థాయిలో పేరొందిన సంస్థ స్విమ్స్. అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులతో పాటు ఫిజియోథెరపీ కాలేజీని ప్రారంభించిన ఏకైక సంస్థ కూడా ఇదే. ఇక్కడ వైద్యవిద్యను అభ్యసించిన సూపర్ స్పెషలిటీ డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు తయారు చేసే దేవాలయం స్విమ్స్ ఆస్పత్రి. అటువంటి ఆస్పత్రి కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయ జోక్యంతో దయనీయ పరిస్థితికి చేరుకుంటోంది.

విరాళాల లక్ష్యం పక్కదారిపడుతోందా!

లార్డ్ బాలాజీ పేరుతో భక్తులు ఇచ్చే రూ.కోట్ల విరాళాలు సైతం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేదల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకమైన స్విమ్స్ ఆస్పత్రికి వచ్చే రూ.కోట్ల విరాళాల వినియోగంపై స్విమ్స్‌లోని కొందరు వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విరాళాలను అనవసరంగా వేతనాలపై ఖర్చు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నిధులు కేవలం రోగుల వైద్యం, ప్రాణాలను కాపాడేందుకు వినియోగించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

వైద్యుల నియామక నోటిఫికేషన్‌లో మతలబు ఏమిటో!

పారా మెడికల్, నర్సులు, పరిపాలనా సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇదిలా ఉంటే మరో రెండేళ్లలో అనేక మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకునేందుకు కూటమి నేతలు, ముఖ్య నేత బంధువులు ఇద్దరు ప్రయత్నాలు ప్రారంభించారు. నియామకాల పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేయడంతోపాటు.. కూటమి నేతల బంధువులు, అనుచరులు, సన్నిహితులతో స్విమ్స్‌ని నింపేసేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నట్లు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. స్థానిక నియామకాలపై దృష్టి సారించకుండా..విభాగాల పేర్లు మారుస్తూ, పోస్టుల సంఖ్యను తమ అనుచర వర్గం కోసం పెంచి అర్హతలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారనే ప్రచారం గుప్పుమంటోంది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించడంలేదు. నేషనల్ మెడికల్ కమిషన్ ప్రమాణాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల తరువాత ఉద్యోగ విరమణ చేయబోయే డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, పాలనా విభాగంలో పనిచేసే వారి స్థానంలో కూటమి శ్రేణుల బంధువులు, సన్నిహితులను నియమించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించారు. నిబంధనలను పక్కనపెట్టి రూ.లక్షల వేతనం ఇచ్చి, వారి అనుచరులను నియమించుకునేందుకు సిద్ధమయ్యారు. ఏయే పోస్టుకు ఎంతెంత రేటు ఖరారు చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వైద్య సేవలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఏడాదిగా జరుగుతున్న పరిణామాలతో స్విమ్స్ ఆస్పత్రి లక్ష్యం వైపు పయనిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోగులకు నాణ్యమైన వైద్యం అందకపోవడంపై నిపుణుల కమిటీతో విచారణ చేయించాలనే డిమాండ్ వినిపిస్తోంది. మెడికల్ ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, సర్వీస్ రూల్స్ గురించి అవగాహనలేని అధికారులు విచ్చల విడి రాజకీయ జోక్యంతో టీటీడీ ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నోటిఫికేషన్లకు నిధులను మళ్లిస్తోందనే ఆరోపణలున్నాయి. టీటీడీ యాజమాన్యం భక్తులకు మనోభావాలను కాపాడేలా, పేదలకు వైద్యసేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు. అక్రమ వైద్యుల నియామక నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేసి, ప్రస్తుత పరిణామాలపై పూర్తి స్థాయి విచారణ చేయాల్సిన అవసరం ఉందని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ట బందోబస్తు

- పద్మావతీ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

చంద్రగిరి: భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 24, 25వ తేదీల్లో తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం రానున్నారు. తిరుమల శ్రీవారితో పాటు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆయన దర్శించుకోనున్నారు. ఈ క్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ ఉన్నతాధికారులు తిరుచానూరుకు చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి రానున్న నేపథ్యంలో కల్పించాల్సిన ప్రత్యేక ఏర్పాట్లకు సంబంధించి ఆలయ మాడవీధులు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై ఏర్పాటు చేసిన ట్రయల్ రన్‌ను పరిశీలించి, అక్కడ నుంచి తిరుమలకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం ఎదుట జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ఇతర అధికారులు

ఉప రాష్ట్రపతి పర్యటనపై సమీక్ష

రేణిగుంట: భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుమల శ్రీవారి దర్శనార్థం ఈనెల 24, 25 తేదీల్లో తిరుమలకు వస్తున్న సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జేసీ శుభం భన్సల్ సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి తిరుమల పర్యటనలో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని ఆదేశించారు. ముందస్తు భద్రత లైజన్, మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. విమానాశ్రయంలో భద్రత, ప్రోటోకాల్ అంశాలపై సంబంధిత అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, శ్రీ కాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యవృత్తి దైవంతో సమానం




మాట్లాడుతున్న స్విమ్స్ వర్సిటీ వీసీ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: వైద్య వృత్తి దైవంతో సమానమని, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి మెడికల్ కళాశాలలో సీట్లు సాధించడం విద్యార్థుల అదృష్టమని స్విమ్ యూనివర్సిటీ వీసీ, డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. సోమవారం స్విమ్స్ యూనివర్సిటీలో నూతనంగా అడ్మిషన్లు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించిన ప్రతి విద్యార్థీ సేవభావంతో రోగులకు వైద్యసేవలు అందించాలని కోరారు. చికిత్స చేసి, ప్రాణం కాపాడే దేవుడిగా పేదలు డాక్టర్‌ను నమ్ముతారని, ఆ నమ్మకాన్ని ప్రతి వైద్యుడూ నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడాటానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారే వైద్యులని తెలిపారు. వైద్యవిద్యతో మంచి భవిష్యత్తు ఉంటుందని, వైద్యాన్ని ధనార్జనే ధ్యేయంగా కాకుండా సమాజసేవకు, పేదల కోసం వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ అలోక్ సచన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య పెన్నిధి.. రాయలసీమకే తలమానికం.. రోజురోజుకూ పెరుగుతున్న రోగులు.. సరిపోని వసతులు.. ఈ విషయాన్ని నాటి వైఎస్సార్ సీపీ సర్కారు గుర్తించింది. నాడు–నేడు పథకంలో నిధులు మంజూరు చేసింది. అభివృద్ధికి బాటలు వేసింది. అయితే కూటమి రాకతో నిధులు విడుదల శూన్యం.. వెరసి.. అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఫలితంగా పేదలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్యసేవలు అందని దుస్థితి నెలకొంది. ఏమిటయ్యా రుయా అభివృద్ధిపై కూటమి ఇంత నిర్దయగా వ్యవహరిస్తోందని పేదలు విమర్శిస్తున్నారు.

రుయా..నిర్దయ!



రుయాలో నిర్మిస్తున్న ఏడంతస్తుల ఐపీ బ్లాక్

- గత ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధికి పెద్దపీట
- నాడు–నేడు పథకంలో రూ.400 కోట్లు మంజూరు
- తొలి విడతలో రూ.90 కోట్లు కేటాయింపు
- ఎమర్జెన్సీ, ఐపీ బ్లాక్, లెక్చరర్ కాంప్లెక్స్, ఉమెన్స్ హాస్టల్ నిర్మాణాలు
- ఆ నిధులతో కొంత వరకు సాగుతున్న పనులు
- మిగిలిన నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం

తిరుపతి తుడా: రాయలసీమ పేదల పెద్దాస్పత్రి అభివృద్ధికి నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్య సీట్ల సామర్థ్యాన్ని పెంచింది. తద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో సఫలీకృతమైంది. రుయాలో మల్టీస్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను విస్తరించింది. రుయాకు రోగులు తాకిడి పెరుగుతుండడం పాత భవనాలు దిక్కుగా మారాయి. నాటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు– నేడు ప్రాజెక్టు ద్వారా రుయాస్పత్రి అభివృద్ధికి రూ. 400 కోట్లను మంజూరు చేసింది. ఇందులో 2023లో రూ.90 కోట్లను విడుదల చేసింది. ఎమర్జెన్సీకి రోగులు తాకిడి పెరగడం, ఔట్ పేషెంట్లకు సరైన ఓపీ కేంద్రం లేకపోవడం, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అనువైన లెక్చరర్ గ్యాలరీ అవసరమని అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి సిఫారసు చేశారు. నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం వీటికి శరవేగంగా అనుమతులు ఇవ్వడంతో రుయాలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు మొదలయ్యాయి.

ఏడు అంతస్తులతో ఐపీ బ్లాక్

రుయా ఆస్పత్రికి రోగుల తాకిడి రోజు రోజుకు పెరుగుతుంది. రోజుకు వెయ్యి నుంచి 1200 ఓపీకి వస్తుంటాయి. అదే స్థాయిలో అత్యవసర విభాగంలోనూ 300 నుంచి 500 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. పాత భవనాలు అంత మందికి వైద్యం అందించే సామర్థ్యం లేకపోవడంతో కొత్త భవనాలు అవసరమని భావించారు. నాటి ప్రభుత్వానికి రుయా అధికారులు ప్రతిపాదనలు పంపగానే అనుమతులిచ్చి నిధులను మంజూరు చేసింది. ఆధునిక సౌకర్యాలతో ఐపీ బ్లాక్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అలిపిరికి ఆనుకుని రూ. 80 కోట్లతో ఐపీ బ్లాక్ పనులు ప్రారంభమయ్యాయి. ఏడు అంతస్తుల భారీ భవన నిర్మాణ పనులు 2024 చివరి వరకు వేగంగా కొనసాగాయి. ప్రస్తుతం జీ ప్లస్ టూ అంతస్తులుకు సంబంధించి కాంక్రీట్ వర్క్‌ను పూర్తి చేశారు. అలానే వైద్య విద్యార్థులకు అత్యాధునిక లెక్చరర్ గ్యాలరీ కాంప్లెక్స్ నిర్మాణానికి నాటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ. 35 కోట్ల వ్యయంతో ఐదు అంతస్తుల భవన నిర్మాణ పనులు 2023 చివరిలో ప్రారంభించారు. అలాగే రూ.18 కోట్లతో యూజీ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి పునాదులు పడ్డాయి. అప్పటి ప్రభుత్వం విడుదల చేసిన రూ. 90 కోట్లలో హాస్టల్ ఆధునీకరణ కోసం రూ.5 కోట్లను కేటాయించారు. పై మూడు ఆధునిక భవనాల నిర్మాణం కోసం రూ.75 కోట్లను కాంట్రాక్టర్లకు విడుదల చేశారు. రూ.90 కోట్లలో ప్రస్తుతం ఏపీఎంఎస్ఐడీసీ వద్ద ప్రస్తుతం రూ.10 కోట్లు మాత్రమే బడ్జెట్ ఉంది. నిర్మాణ పనులు పూర్తి చేసిన ప్రకారం ఆ రూ.10 కోట్లు కూడా కాంట్రాక్టర్లకు సరిపోయే అవకాశం లేదు. నిధులు కేటాయిస్తే గానీ ఈ భవనాలు పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు.

చిల్లిగవ్వ విదల్చని కూటమి సర్కార్

పేదల పెద్ద ఆస్పత్రిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతోంది. రోగులకు చిల్లిగవ్వ విదల్చకుండా పోవడంతో రుయాలో అభివృద్ధి పనులు అర్థంతరంగా ఆగిపోనున్నాయి. నిర్మాణ దశలో ఉన్న భారీ భవనాలు మొండి గోడలు గానే మిగిలిపోనున్నాయి. ఫలితంగా రోగులకు సౌకర్యవంతమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించలేకపోతోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అత్యవసరంగా మరో రూ.130 కోట్లు విడుదల చేస్తేనే రుయాలో చేపట్టిన ఆధునిక ఐపీ బ్లాక్, ఎమర్జెన్సీ, లెక్చరర్ గాలరీ కాంప్లెక్స్, ఉమెన్స్ హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. లేకపోతే మొండి గోడలు గానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో ఇప్పటివరకు అభివృద్ధి పనులు కొనసాగాయి. ఆ భవనాలు పూర్తి కావాలంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే రూ.130 కోట్ల నిధులను విడుదల చేయాల్సి ఉంది.



నిధులు విడుదల కాకపోవడంతో నిదానంగా సాగుతున్న ఉమెన్స్ హాస్టల్ భవనం



నత్తనడకన సాగుతున్న లెక్చరర్ గ్యాలరీ కాంప్లెక్స్

ఎస్వీయూకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టు



ప్రాజెక్ట్‌కు ఎంపికైన అధ్యాపకులతో వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, పార్ట్‌నర్ షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ కార్యక్రమం కింద సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నుంచి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎస్వీయూకు దక్కింది. సోమవారం వీసీ అప్పారావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ విశ్వవిద్యాలయం హబ్‌లో ఎస్వీయూ స్పోక్ సంస్థగా పరిశోధనలు చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద ఎస్వీయూకు ఆరోగ్యం, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశోధనలను బలోపేతం చేయడానికి రూ.13.94 కోట్లతో పాటు మరో కోటి రూపాయలు ఓవర్‌హెడ్‌గా మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయం పరిశోధన సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు గణనీయమైన మెరుగుదలను చూస్తాయని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఎస్వీయూ నుంచి ఆచార్యులు బాలజీ, ఓవీఎస్‌రెడ్డి, ఎం రాజశేఖర్, హేమ, నరసింహ దివాకర్‌రెడ్డి, మాధవి, కేవీ సరిత ఎంపికయ్యారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులూ రారండి!

తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మెగా డీఎస్సీ- 2025లో ఎంపికైన అభ్యర్థులందరూ సెప్టెంబర్ 24వ తేదీ ఉదయం 7 గంటలకు తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని చదలవాడ ఇంజినీరింగ్ కాలేజీకి తప్పనిసరిగా రావాలని డీఈఓ కేవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కాల్ లెటర్, ఆధార్ కార్డుతో రిపోర్టు చేయాలన్నారు. 25వ తేదీన అమరావతి కేంద్రంగా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేస్తారని, అందుకు గాను ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులుండడంతో గొడుగు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ ఫొటోతోపాటు ఐడీ కార్డులు, కాల్‌లెటర్లతో చదలవాడ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని, ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.

తెలుగుగంగ కాలువలో యువకుడి గల్లంతు


శ్రీను (ఫైల్)

కలువాయి(సైదాపురం): ఓ యువకుడు దాహం తీర్చుకోవడానికి తెలుగుగంగ కాలువలోకి దిగి, గల్లంతైన ఘటన కేశమనేనిపల్లిలో జరిగింది. కలువాయి మండలం కేశమనేనిపల్లి గ్రామానికి చెందిన చలకచర్ల శీను (28) కూలీ పనులు చేసుకున్నాడు. దాహం వేయడంతో నీరు తాగేదానికి తెలుగు గంగ కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. శ్రీనుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

శ్రీవారి గొడుగులకు ఘన స్వాగతం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా స్వామివారికి సమర్పించనున్న గొడుగులు సోమవారం తిరుపతికి చేరుకున్న సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలికారు. చెన్నైకి చెందిన ఫోవైసీ అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్టు నిర్వాహకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పాదయాత్రగా తిరుపతిలోని శ్రీకోదండరామాలయం వద్దకు చేరుకున్న 8 శ్రీవారి గొడుగులకు భక్తులు పూజలు చేశారు. అనంతరం గొడుగులు తిరుమలకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పసుపులేటి హరిప్రసాద్, రంగస్థలి చైర్మన్ గోపినాథ్ రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, నవీన రెడ్డి బాబు, హనుమంతరావు, సుబ్బరామయ్య, పానగంట భాస్కర్ పాల్గొన్నారు.

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి రూరల్: శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)లో వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వర్సిటీ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బీఈడీ అడిషనల్ మెథడాలజీ, ఎంకామ్, ఎంఏ తెలుగు, ఎంఏ సంగీతం, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన), వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

అక్రమ కేసులు కక్ష సాధింపే



అధికారం చేపట్టిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, దాడులు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే పత్రికల గొంతు నొక్కి అక్రమ కేసులు బనాయించడం కక్ష సాధింపే. ప్రభుత్వం చేస్తున్న అరచాకాలను వెలుగులోకి తెచ్చేలా వార్తలు రాస్తే వారిపై కక్ష సాధింపు చర్యగా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవస్థలను చేతుల్లోకి తీసుకునేలా వ్యవహరించడం, సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు విలేకర్లపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడమే.

– జీ శశికుమార్, గూడూరు నియోజకవర్గ కార్యదర్శి, సీపీఐ



కేసులు పెట్టడం బాధాకరం



కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దాడులు, అరచకాలను వెలుగులోకి తీసుకుని వచ్చిన మీడియాపై కేసులు బనాయించడం బాధాకరం. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ప్రజా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే సాధనం మీడియా. అలాంటి మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడం శోచనీయం.

– సీహెచ్ ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి

సమస్యలు పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 382 అర్జీలు
- రెవెన్యూ సమస్యలపై 221 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అధికారులు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన పీజీఆర్ఎస్ జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 382 అర్జీలు వచ్చాయి. అందులో 221 అర్జీలు రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. గ్రీవెన్స్‌కు డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మాండ్, దేవేంద్రరెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద 79 ఏళ్ల వృద్ధుడు దీక్ష

తొట్టంబేడు మండలంలోని శ్రీకృష్ణాపురంలో 79 ఏళ్ల వయస్సు కలిగిన న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సద్దికూటమి వీరాస్వామి పూలమాల మెడలో వేసుకుని దీక్ష చేపట్టారు. ఆదే సమయంలో అక్కడే ఉన్న ఏఎస్పీ రవిమనోహరాచారి ఆయన సమస్యను తెలుసుకున్నారు. వెంటనే గ్రీవెన్స్ నిర్వాహకుడు జగదీష్‌ను పిలిపించి...ఆయన సమస్యను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. దీంతో జగదీష్ తొట్టంబేడు రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. వెళ్లి తహసీల్దార్‌ను కలవాలని సూచించారు. అయితే ఆయన తమకు న్యాయం జరగడం లేదంటూ కలెక్టరేట్ ఆవరణంలోనే కూర్చొని ఉండిపోయారు.

తల్లికి వందనం రాలేదు!

తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన రెహానా అనే మహిళ తమ పిల్లలు మహ్మద్ ఇంతాన్(8వ తరగతి), దాదషియర్(7వ తరగతి) తల్లికి వందనం రాలేదని వాపోయారు. ఆధార్‌కార్డు మ్యాపింగ్ కాలేదని చెప్పడంతో మ్యాపింగ్ తప్పులను సవరించుకోవడానికి వచ్చానని వెల్లడించారు. తాను పేద కుటుంబానికి చెందిన వారమని, తమ పిల్లలకు తల్లికి వందనం ఇప్పించాలని అధికారులకు ఓ వినతిపత్రం అందజేశారు.

రెండు కాళ్లు పనిచేయడం లేదు

రెండు కాళ్లు పనిచేయడం లేదు, మాటలు సక్రమంగా రావడం లేదని, 90శాతం వికలత్వం ఉన్నా తనకు పింఛన్ ఇవ్వడం లేదని పుత్తూరుకు చెందిన మురగన్‌ను సోమవారం తమ తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. పింఛన్ ఇప్పించాలని అధికారులను కోరారు.

వీఆర్ఏ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోదా?

ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)ల సమస్యలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వీఆర్ఏలు ధర్నా చేశారు. వారికి ఏఐటీయూసీ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీఆర్వోల జీతాలు పెంచాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నేత జనమాల గురువయ్య, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ రవి, సీహెచ్ శివకుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, వీఆర్ఏల సంఘం నేతలు వెంకటేష్, గీత, గణపతి, ప్రేమ్‌కుమార్, రామ్మూర్తి, హరి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

కారుణ్య నియామకాలు పూర్తి చేయండి

విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలను పూర్తి చేయాలని ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేల్ రూపొందించడంతో తమకు నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ విభాగం ఉద్యోగులు

దర్భ చాప, తాడు ఊరేగింపు


రంగనాయక మండపంలోని శేషవాహనంపై దర్భ చాప, తాడు


దర్భ చాప, తాడుకు పూజలు చేస్తున్న అధికారులు, పండితులు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భచాప, తాడును టీటీడీ అటవీ విభాగం కార్యాలయం నుంచి సోమవారం డీఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణం కార్యక్రమంలో వీటిని ఉపయోగిస్తారు.

ధ్వజారోహణానికి దర్భ చాప, తాడు కీలకం

బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం పైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టీటీడీ అటవీ శాఖ 10 రోజుల ముందు నుంచే కసరత్తు చేస్తోంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఇందుకోసం ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో ఉన్న విష్ణు దర్భను టీటీడీ అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాప, 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడు సిద్ధం చేశారు.

దర్భ వైశిష్ట్యం

వేదోక్త శాస్త్రాల్లో దర్భ (కుశ గడ్డి) అత్యంత పవిత్రమైనదిగా పేర్కొన్నారు. రుగ్వేదంలో ''కుశాః పవిత్రా భవతు'' అని దర్భను శుద్ధికరమైనదిగా చెప్పగా, యజుర్వేదంలో దర్భాసనంపై కూర్చొని చేసే ఉపాసన శ్రేష్ఠ ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా చూసినా ఇందులో సిలికా అధికంగా ఉండడంతో వాతావరణ శుద్ధి, సూక్ష్మక్రిముల నిర్మూలన జరుగుతుంది. కాబట్టి వేదోక్త కర్మల్లో దర్భ వినియోగం, దైవిక వరమని భావిస్తారు.

సిద్ధేశ్వర గుట్టను పరిశీలించిన మైనింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం సమీపంలో ఉన్న సిద్ధేశ్వర గుట్టలో కొన్ని రోజులుగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ మాఫియాపై ఎట్టకేలకు మైనింగ్ అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా శ్రీసిద్ధేశ్వర గుట్టపై అధికార పార్టీకి చెందిన కొందరు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాక్షి దినపత్రికలో 'గుట్టకాయ స్వాహా' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మైనింగ్ శాఖ అధికారులు సోమవారం సిద్ధేశ్వర గుట్టను పరిశీలించారు. అక్రమంగా తరలుతున్న గ్రావెల్ మాఫియాను అడ్డుకున్నారు. టిప్పర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. రూ.కోట్ల విలువైన ఎర్రమట్టిని కూటమి నాయకులు తిరుపతికి తరలించి సొమ్ము చేసుకునే క్రమంలో మండలంలోని గుట్టలు కరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై స్పందించిన మైనింగ్‌శాఖ అధికారులు సిద్ధేశ్వర గుట్టను పరిశీలించి తాత్కాలికంగా అక్రమ మైనింగ్ పనులను నిలిపివేశారు. కేవలం రాజకీయ ఒత్తిడితోనే సిద్ధేశ్వర గుట్టను నామమాత్రంగా పరిశీలించారని, అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తవ్వకాలు జరుపుతున్న వాహనాలను సీజ్ చేయకుండా వెనుతిరగడం ఏమిటని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పట్టువస్త్రాలను సమర్పించడానికి ఈ నెల 24, 25 తేదీల్లో సీఎం చంద్రబాబునాయుడు తిరుమల పర్యటన ఉందని, అందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనర్ మౌర్యతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని తెలిపారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సేఫ్టీ రూమ్ అధునాతన లైఫ్ సపోర్ట్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. శానిటేషన్ ఏర్పాట్లు, కాన్వాయ్ వెహికల్స్ ఏర్పాటు, హెలిపాడ్‌లో భద్రత ఏర్పాట్లు, ప్రొటోకాల్ అంశాలు విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాజ్ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి పరిశీలించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

స్కానర్లు దాచేశారు!


మూలన పడిన స్కానర్లు

శ్రీకాళహస్తి: శివాలయంలో జరిగే అవకతవకలు భక్తుల ఇబ్బందులను తెలిపేలా ప్రభుత్వం ప్రతి ఆలయంలో ఫ్లెక్సీల రూపంలో స్కానర్లను ఏర్పాటు చేసింది. ఆ స్కానర్లు శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కనిపించకుండా చేసేశారు. చెప్పులు స్టాండ్, మొబైల్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, ఆలయం ఎంట్రన్స్, రూములు కేటాయించే చోట, పీఆర్వో ఆఫీస్ వద్ద, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం స్కానర్లు ఫ్లెక్సీ రూపంలో భక్తుల సూచనలు, సలహాలు ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేయమని సూచనలు చేసింది. ఆలయాధికారులు తూతూ మంత్రంగా స్కానర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని కూడా ఇప్పుడు మాయం చేశారు. ఆలయంలో జరిగే దోపిడీలను భక్తులు స్కాన్ చేసి, ఫిర్యాదుల రూపంలో వెల్లువెత్తడంతోనే ఈ స్కానర్లు మాయం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెప్పులు స్టాండ్ వద్ద నుంచి రాహు కేతు మండపాల వరకు, ప్రతి విషయంలో జరుగుతున్న దోపిడీలు స్కానర్ ద్వారా భక్తులు ఫిర్యాదు చేస్తుండడంతో వాటిని కనిపించకుండా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి స్కానర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

విశ్వంలో ఘనంగా యూఎస్‌ఓ ఇంటర్ స్కిల్స్ ఫెస్ట్


ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈఓ, సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: జీవకోనలోని విశ్వం హైస్కూల్ వేదికగా యూఎస్‌ఓ ఇంటర్ స్కిల్స్ ఫెస్ట్–2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని, భావి భారతానికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలిసారి ఈ ఫెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు పాల్గొని, పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ విశ్వనాథ్‌రెడ్డి, డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, యూఎస్‌ఓ వైస్ ప్రెసిడెంట్ కేవీ త్యాగరాజన్ పాల్గొన్నారు.

చెన్నై- నెల్లూరు మెమో రైలు నేడు రద్దు

నాయుడుపేటటౌన్: చెన్నై- నెల్లూరు మెమో రైలును మంగళవారం రద్దు చేసినట్లు నాయుడుపేట రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి సోమవారం తెలిపారు. పలు ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతు కారణంగా మెమో రైలు రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. ఈ అసౌకర్యాన్ని రైల్వే ప్రయాణికులు తెలుసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి

శ్రీకాళహస్తి: ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామానికి చెందిన మునిరెడ్డి (55) శ్రీకాళహస్తిలో 12 ఏళ్లుగా నివాసం ఉంటూ ఒకవైపు వ్యవసాయం చేసుకుంటూ మరోవైపు డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. విధుల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని అమరజ్యోతి కల్యాణ మండపం ఎదురుగా రాత్రి 10.50 సమయంలో ఫుడ్ డెలివరీ ఇవ్వడానికి తన ద్విచక్ర వాహనం లో ఎస్కే ఫుడ్ రెస్టారెంట్‌కు వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేసే సమయంలో గూడూరు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో మునిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.16లక్షలు దోచేశారు!

- నాసిరకంగా ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ మరమ్మతులు
- చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్న గదులు
- పీఆర్ ఏఈ చేతివాటం



ఉరుస్తున్న ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయ గదులు


వర్షానికి ఉరవగా వరండాలో నిలిచిన నీరు

ఏర్పేడు: శిథిలావస్థకు చేరిన భవన మరమ్మతు పనులకు కేటాయించిన రూ.16 లక్షలు అధికారులు దోచేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి ఉరుస్తుండడంతో రూ.16 లక్షలు జెడ్పీ నిధులను వెచ్చించి మూడు నెలల కిందట భవన మరమ్మతు చేశారు. అయితే చిన్నపాటి వర్షానికి కార్యాలయంలోని గదులన్నీ ఉరుస్తున్నాయి. కార్యాలయ ఉరువు నివారణకు ఎలాంటి పనులు చేపట్టకుండా రంగులు వేసి వదిలేశారని పలువురు పెదవి విరుస్తున్నారు. పనుల నాణ్యతను పరిశీలించి పనులను చేయించాల్సిన పీఆర్ ఏఈ రవితేజ చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. నిధులు వెచ్చించినా భవనం ఉరుస్తుండడంతో కార్యాలయ సిబ్బంది పాట్లు షరా మామూలే అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

ఆస్పత్రికి వెళుతూ తిరిగిరాని లోకాలకు..


మునెమ్మ మృతదేహం


మునెమ్మ(ఫైల్)


బాలాజీ మృతదేహం


బాలాజి(ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి

నారాయణవనం: వైద్య పరీక్షల కోసం పుత్తూరుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై నింద్ర మండలం ఐఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన తల్లీకొడుకులు మునెమ్మ(47), బాలాజీ(28) మృతి చెందారు. ఈ సంఘటన నారాయణవనం బైపాస్‌లోని జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నింద్ర మండలం ఐఆర్ కండ్రిగకు చెందిన కేశవులు భార్య మునెమ్మ అనారోగ్యంతో బాధ పడుతోంది. సోమవారం ఉదయం కుమారుడు బాలాజీతో మోటార్ సైకిల్‌పై తిరుపతిలో ఆస్పత్రికి బయలుదేరారు. నారాయణవనంలో 716–ఎ జాతీయ రహదారి బైపాస్‌లోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. రహదారిలో గుంటను తప్పించడానికి మోటార్‌సైకిల్‌ను కుడివైపునకు నడిపాడు. అదే సమయంలో చెన్నై వైపు వెళుతున్న కారును ఢీకొనడంతో మునెమ్మ, బాలాజీ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కేశవులు ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోపి తెలిపారు.

సంఘమిత్ర చేతివాటం

– రూ.11 లక్షలు స్వాహా

తిరుపతి రూరల్: మండలంలోని కుంట్రపాకం పంచాయతీలో సంఘమిత్ర డ్వాక్రా డబ్బులు రూ.11 లక్షలు స్వాహా చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలో సంఘమిత్రగా పనిచేస్తున్న చెంచులక్ష్మి, ఆదే పంచాయతీ పరిధిలో నివాసముంటున్న ఎస్టీలకు చెందిన మూడు పొదుపు సంఘాల డబ్బులను స్వాహా చేసినట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు లెక్కలు తనిఖీ చేశారు. రూ.11 లక్షల వరకు స్వాహా చేసినట్లుగా నిర్ధారించుకున్న తరువాత సంఘమిత్ర చెంచులక్ష్మిని విచారించారు. చాలా వరకు గ్రూపు సభ్యుల నుంచి కూడా డబ్బులు రావాల్సి ఉండడంతో సంఘమిత్ర వాడుకున్న డబ్బుతోపాటు బకాయి పడిన సభ్యులందరితో వసూలు చేసి, ఆ మొత్తాన్ని జమ చేయాలని ఆదేశించారు. దీనిపై ఏపీఎం నాగేశ్వరరావును వివరణ కోరగా రూ.15 లక్షలు కాదని, ఆ సంఘమిత్ర పరిధిలోని గ్రూపుల లెక్కలు తనిఖీ చేయగా రూ.11 లక్షలు తేడా వచ్చిందన్నారు. ఇంకా బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాల్సి ఉందని, ఆ తరువాత పూర్తి సమాచారం ఇస్తామని చెప్పారు. సంఘమిత్ర ఆస్పత్రి లో ఉందని ఆమె వచ్చిన తరువాత వాడుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని అంగీకరించారని తెలిపారు.

ప్రతి భక్తుడికీ బస్సు సౌకర్యం

- తిరుపతి, చిత్తూరు డీఎంలతో ఆర్టీసీ ఈడీ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఈడీలు చంద్రశేఖర్, చెంగల్‌రెడ్డి, డీపీటీవో జగదీష్

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రతి భక్తుడికి ఆర్టీసీ సర్వీసులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ ఆపరేషన్స్) చంద్రశేఖర్ పేర్కొన్నారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయంలో సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆర్టీసీ డీఎంలు, అసిస్టెంట్ డీఎంలు, సూపర్‌వైజర్లు, మెకానిక్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు ప్రతి రోజు 2వేల ట్రిప్పులను తిప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ మేరకు రోజుకు 1,20,000 మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యం చేర్చడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గరుడ సేవ రోజు మాత్రం 3,125 ట్రిప్పులను తిప్పడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దాంతో ఆ రోజు 2,30,000 మంది భక్తులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విజయవాడ నుంచి విచ్చేసిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ ఇంజనీరింగ్) చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం డీపీటీవో జగదీష్ మాట్లాడుతూ తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే మార్గంలో 1, 6, 8, 11వ కిలోమీటర్ రాయి సమీపంలోని మలుపులు, వచ్చే మార్గంలో 1, 2, 3, 7, 12, 30, 38, 58వ కిలోమీటర్ రాయి సమీపంలోని మలుపులు ఎంతో ప్రమాదకరంగా గుర్తించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బాలాజీ, డీఎంలు, అసిస్టెంట్ డీఎంలు, సూపర్‌వైజర్లు, మెకానిక్స్ పాల్గొన్నారు.